క్లుప్తంగా

పాఠశాలలో డైనింగ్ హాలు ఏర్పాటు



పూజలు చేస్తున్న అనిల్ బజాజ్

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులతో డైనింగ్ హాల్ ఏర్పాటు చేసింది. మంగళవారం ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ అనిల్ బజాజ్ పూజా కార్యక్రమాల అనంతరం హాల్‌ను ప్రారంభించారు. విద్యార్థులు శుభ్రమైన వాతావరణంలో భోజనం చేసేందుకు వీలుగా హాల్‌ను నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. హెచ్ఆర్ రంగకుమార్, ఇన్‌చార్జ్ హెచ్ఎం సుహాసిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఈఓ

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో నంద్యాలకు చెందిన శాంతిరాం ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన సుమారు 200 మందికి బీపీ, షుగర్, జ్వరం, కీళ్లనొప్పులు, కంటి సమస్యలకు సంబంధించి డాక్టర్లు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ ప్రకాష్‌నాయుడు, వైద్య సిబ్బంది వెంకటరమణ, కిషోర్‌బాబు, ఓబులేసు, నాగరాజు పాల్గొన్నారు.

బడుల విలీనాన్ని నిలిపివేయాలని వినతి



మంత్రి బీసీకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని ఆపివేయాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మంగళవారం బనగానపల్లెలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రకాష్, జిల్లా ఆడిట్ కన్వీనర్ దస్తగిరి కలిశారు. 3,4,5వ తరగతుల విలీనాన్ని నిలిపివేసి, 1-5వ తరగతి వరకు ఉండే పాఠశాలలు కొనసాగించాలని కోరారు. పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. యూటీఎఫ్ సభ్యులు నాగరాజు, వీర కుమార్‌రెడ్డి, పీఎండీ హుస్సేన్, సతీష్‌కుమార్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులలో ఎంఈఓ, హెచ్ఎం

డోన్ టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన అందిస్తున్నట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ అన్నారు. మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలోని ప్రధాన పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవం, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పట్టాలు అందించి అభినందించారు. అనంతరం ప్రవేశాలకు సంబంధించి ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న పథకాలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, హెచ్ఎం రంగనాథ్, స్కూల్ కమిటీ చైర్మన్ రామకృష్ణ, సీఆర్‌పీ వెంకటేశ్వరమ్మ, హెచ్ఎం ఉమాదేవి పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం



బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్స్

సంజామల: అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. సంజామల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ శాంత గర్భిణులు, బాలింతలు పిల్లల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వెయ్యి రోజుల కేర్, రక్తహీనత తదితర అంశాలపై తల్లులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాటేసిన కరువు

- తీవ్ర కరువు మండలంగా కొలిమిగుండ్ల
- ఇటీవల జాబితా విడుదల చేసిన ప్రభుత్వం
- రబీలో తీవ్ర వర్షాభావ పరిస్థితులే కారణం
- ప్రభుత్వ సాయంపై అన్నదాతల ఆశలు



దెబ్బతిన్న శనగ పంట(ఫైల్)

కొలిమిగుండ్ల: వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో రబీ రైతులను కన్నీరు పెట్టించింది. ఎన్నో ఆశలతో పంటలు సాగు చేసినా చివరకు వరుణుడు ముఖం చాటేయడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడి నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. రబీలో ప్రధానంగా శనగ పంటను సాగు చేస్తుంటారు. వర్షాలు నిరాశ పర్చడంతో చెరువులు వెలవెలబోయాయి. వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదు కావడంతో దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. కొలిమిగుండ్ల మండలంలో ప్రధానంగా వర్షాధారం, బోర్ల కింద మాత్రమే పంటలు సాగవుతుంటాయి. సాగునీటి వనరులు కనిపించనంత దూరంలో ఉన్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం కరువు మండలాల జాబితాను విడుదల చేసింది. ఇందులో నంద్యాల జిల్లాలో కొలిమిగుండ్ల మండలం మాత్రమే అత్యంత కరువు మండలంగా గుర్తించారు. ఇంటిగ్రేటెడ్ రెయిన్ గేజ్ ప్రకారం అక్టోబర్ నుంచి ఈఏడాది మార్చి వరకు కేవలం 157.8 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. మండలం పూర్తి స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడం విశేషం. ఒక చోట కురిస్తే మరొక చోట కురవలేదు.

సాయం అందేనా

తీవ్ర కరువు మండలంగా కొలిమిగుండ్ల మండలాన్ని ఎంపిక చేయడంతో రైతులు ఓ రకంగా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే పంట నష్టం జరిగిన వారందరికీ సాయం అందుతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏమాత్రం నష్టపరిహారం విడుదల అవుతుందా అనే డోలాయమానంలో ఉన్నారు. రబీలో ప్రధానంగా శనగ 4767 హెక్టార్లు, జొన్న 225 హెక్టార్లు, మినుము 103 హెక్టార్లు, నూగులు 124 హెక్టార్లలో సాగు చేశారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ సిబ్బంది పంట దిగుబడిపై అంచనా వేశారు. ఏరకమైన పంట హెక్టారుకు ఎంత మేర దిగుబడి వస్తుందో అనే అంశాలపై ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశారు. సాధారణ దిగుబడి కంటే తక్కువ దిగుబడులు వచ్చాయి. సిబ్బంది ఫీల్డ్‌కు వెళ్లి పంట నష్టాన్ని గుర్తించి జాబితా పంపారు. ఇక మిగిలింది ప్రభుత్వం సాయమే. అందరికి ఇస్తారా.. ఎంత మేర ఇస్తారనేది రైతుల్లో చర్చ జరుగుతోంది.

రైతులను ఆదుకోవాలి



రబీలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల దిగుబడిపై ప్రభావం చూపింది. 18 ఎకరాల్లో శనగ సాగు చేశాను. ఎకరాకు మూడు బస్తాల మేర మాత్రమే దిగుబడి లభించింది. లాభాలు రాకపోయినా పెట్టుబడులకు సరిపోయాయి. కరువు మండలంగా ప్రకటించడంతో రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి.

–గుర్విరెడ్డి, రైతు, నందిపాడు

వర్షాలు లేక నష్టపోయాం



రెండు ఎకరాల్లో మినుము సాగు చేశాను. పంట వేశాక వర్షాలు ముఖం చాటేశాయి. సకాలంలో నీళ్లు లేకపోవడంతో పంట ఎండిపోయింది. పెట్టుబడి కూడా దక్కలేదు. కరువు మండలం రూపంలో అయినా ప్రభుత్వం రైతులను ఆదుకుంటే కొంత వరకు ఉపశమనం కలుగుతుంది.

–చిన్న హుసేని, రైతు, అబ్బులాపురం

ఉరుసును ప్రశాంతంగా జరుపుకోవాలి



ఉరుసు నిర్వహణపై దర్గా కమిటీతో చర్చిస్తున్న సీఐ

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు ఉసేన్ స్వామి దర్గాలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఉరుసును ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతు నాయక్ సూచించారు. మంగళవారం ఉసేన్ స్వామి దర్గాను సందర్శించి మూడు రోజులపాటు జరిగే ఉరుసుపై దర్గా కమిటీతో చర్చించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాకుండా వైఎస్సార్, అనంతపురం జిల్లాలతో పాటు హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని దర్గా ముతవల్లి గఫార్‌మియా సీఐ దృష్టికి తెచ్చారు. ఉరుసుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌక్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సీఐ పేర్కొన్నారు. రేవనూరు ఎస్ఐ భూపాలుడు, సిబ్బంది ఉన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

బనగానపల్లె రూరల్: బనగానపల్లె బార్ అసోసియేషన్ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవమైంది. నూతన అధ్యక్షుడిగా కె.ఖాజా హుస్సేన్, జనరల్ సెక్రటరీగా శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షుడిగా ఎస్.జాకీర్‌హుస్సేన్, జాయింట్ సెక్రటరీగా ఎస్ఎండీ. అల్లావుద్దీన్, కోశాధికారిగా వై విజయభాస్కర్, లైబ్రరీ సెక్రటరీగా ముజాహిద్ హుస్సేన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బాబావలి తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఖాజాహుస్సేన్ మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

ఐకమత్యంతో ఏదైనా సాధించగలం



రవిమోహన్, వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న సంఘం నాయకులు

డోన్ టౌన్: మాదాసి, మాధారి కురవలు ఐకమత్యంగా ఉండి అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ఇటీవల డోన్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సహాయ కార్యదర్శిగా ఎన్నికైన సంఘం సభ్యుడు న్యాయవాది రవిమోహన్‌తో పాటు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా ఉత్తమ సేవకుడిగా ప్రశంసాపత్రం అందుకున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు కొచ్చెర్వు వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మద్దిలేటి, ప్రసాద్, అలేబాద్ పరమేష్, మునిస్వామి, మేఘవర్ధుడు, పక్కీరప్ప, జయరాముడు, ఓబులేసు, బాలమద్దయ్య, శ్రీను పాల్గొన్నారు.



డోన్ ప్రధాన రహదారిపై నిల్వ ఉంచిన మట్టికుప్పలు

స్థానిక ఆర్టీసీ కొత్తబస్టాండ్ ఎదురుగా కొందరు దుకాణ యజమానులు తమ షాపులకు మరమ్మతులు చేయించి ఆ మట్టి వ్యర్థాలను రోడ్డుపై కుప్పపోసి ఉంచారు. రాత్రివేళల్లో ఈ కుప్పలు గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న మట్టికుప్పలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –డోన్



ఉత్సాహంగా గిరక బండి పోటీలో పాల్గొన్న యువకులు

హోరాహోరీగా గిరక బండి పోటీలు



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న యువకులు



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

బేతంచెర్ల: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని సంజీవనగర్‌కాలనీలో గిలక బండి లాగుడు, టగ్ ఆఫ్ వార్(తాడు లాగే) పోటీలను నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గిరకబండి లాగుడు పోటీల్లో సంజీవనగర్ కాలనీకి చెందిన రాజశేఖర్ విజేతగా నిలిచి రూ.5 వేల నగదు బహుమతి అందుకున్నాడు. తాడు పందెంలో సాయి మారుతి జట్టు విజయం సాధించింది. దాత కటారుకొండ మద్దిలేటి సహకారంతో రూ. 5 వేలు అందజేశారు. నిర్వాహకులు గూని నాగరాజు, నిరంజన్, ఎర్రగుంట్ల రాజు, గంగన్న, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

11న కబడ్డీ పోటీలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 11వ తేదీ గ్రామ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 25 వేలు, ద్వితీయ రూ. 15 వేలు, తృతీయ రూ. 10 వేలు, 4వ బహుమతి రూ. 5 వేల నగదు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 938107492, 9666982986 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

వీఆర్వోల నూతన సంఘం

డోన్ టౌన్: మండల గ్రామ రెవెన్యూ అధికారుల నూతన సంఘాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నూతన ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వీఆర్వోల సమావేశం జరిగింది. అధ్యక్షులుగా రామకృష్ణారెడ్డి, మల్లారెడ్డి, కార్యదర్శిగా మంజుల, సహాయ కార్యదర్శిగా గోవిందు, కోశాధికారిగా మహమ్మద్ యూనస్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సామాజిక కార్యకర్తకు పురస్కారం

డోన్ టౌన్: పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీకి ఉత్తమ సామాజిక కార్యకర్తగా మంత్రి టీజీ భరత్, ఎంపీ నాగరాజ్, కర్నూలు కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం కర్నూలులో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రం అందజేశారు.

పవన విద్యుత్ ప్రాజెక్టుకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ నరసింహులు

బేతంచెర్ల: మండలంలో ఎకోరెన్ సంస్థ విండ్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు రైతులు సహకరించాలని ఆర్డీఓ నరసింహులు అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ప్రకాశ్‌బాబు, ఎకోరెన్ అధికార ప్రతినిధి టి.వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలో గూటుపల్లె, ఎం.పెండేకల్లు గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. పవన విద్యుత్ ప్రాజెక్టుకు భూములిచ్చే రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.30 వేల లీజు చెల్లిస్తారన్నారు. రైతులు, సంస్థ ప్రతినిధులు అగ్రిమెంట్ ప్రకారం 30 ఏళ్లకు లీజు తీసుకోవడం జరుగుతుందన్నారు. రూ. 30 వేలకు రెండేళ్లకు ఒకసారి 5 శాతం కలిపి అదనంగా రైతులకు చెల్లిస్తారని తెలిపారు. రైతుల పొలాల రహదారులకు సైతం లీజు చెల్లిస్తారన్నారు. రైతులకు ఉన్న సందేహాలను ఆర్డీఓ నరసింహులు, ఎకోరెన్ అధికార ప్రతినిధి వెంకటకృష్ణారావు నివృత్తి చేశారు. వీఆర్వోలు రఫీ, వెంకటకృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ రంగనాయకులు

డోన్: పీఎం సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులపై ఉందని ఆర్డీఓ రంగనాయకులు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సూర్యఘర్ యోజన కార్యక్రమ అమలు, విధి విధానాలపై మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ నాగేశ్వర రెడ్డి, వీఆర్ఓలు, సచివాలయ ఉద్యోగులతో చర్చించారు. పలు సూచనలు చేశారు.

మూగజీవాల వైద్యంపై నిర్లక్ష్యం



ఆకుమల్ల పశువైద్యశాల

సంజామల: మూగజీవాల వైద్యంపై పశువైద్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మంగళవారం 10 గంటలైనా ఆకుమల్ల పశువైద్యశాలకు సిబ్బంది రాకపోవడంతో తలుపులు తెరుచుకోలేదు. వైద్యం కోసం వచ్చిన పాడిరైతులు చాలా సమయం వేచిచూసి వెనుదిరిగి వెళ్లారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని.. అందుబాటులో ఉండరని పాడిరైతులు ఆరోపిస్తున్నారు. వేసవి కాలం కావడంతో పశువులు వడదెబ్బ తదితర సమస్యల బారిన పడుతున్నాయని.. వైద్య సిబ్బంది అందుబాటులో లేకుంటే తాము ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. వైద్య సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాల్సి ఉన్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం 10 గంటలకు వచ్చి మధ్యాహ్నం 2 గంటలకే ఇళ్లకు వెళ్లిపోతున్నారు. విధులకు డుమ్మాకొడుతూ ఆన్‌లైన్‌లో హాజరు వేస్తూ పూర్తి జీతాలు తీసుకుంటున్నారు. దీనిపై పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మోహన్‌రావును వివరణ కోరగా ఎవరూ తమ వద్ద అనుమతి తీసుకోలేదని తెలిపారు. సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

మూగ రోదన



బకెట్‌లో నీటిని అందించడంతో దాహార్తి తీర్చుకుంటున్న ఆవు, దూడ

వేసవికాలం కావడంతో సూర్యుడు భగభగమంటున్నాడు. ఉదయం 10 గంటలకే ఎండతీవ్రత అధికంగా ఉండడంతో మనుష్యులతో పాటు పశుపక్షాదులకు సైతం దప్పిక తీరడం లేదు. కోవెలకుంట్ల పట్టణంలోని అయ్యప్పస్వామి వీధిలో మంగళవారం ఆవు, దూడ గుక్కెడునీటి కోసం అగచాట్లు పడ్డాయి. పబ్లిక్ కొళాయి వద్ద దాహార్తి తీర్చుకునేందుకు పడుతున్న ఇబ్బందులను చూసిన స్థానిక మహిళలు బకెట్‌లో నీటిని నింపి ఆవుల దాహార్తి తీర్చారు. ఎంతో దప్పికతో ఉన్న ఆవులు గుటగుటా నీటిని తాగి అక్కడి నుంచి వెళ్లాయి.

–కోవెలకుంట్ల





రోడ్డుపైనే మురుగు, చెరువుపల్లెలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

మురుగురోడ్లు..!

బనగానపల్లె రూరల్: మండలంలోని చెరువుపల్లె గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని కొన్ని వీధుల్లో సీసీరోడ్లు నిర్మించినా మురుగునీరు ప్రవహించేలా కాలువలు నిర్మించకపోవడంతో రోడ్డుపైనే నిల్వ చేరుతున్నాయి. ముఖ్యంగా సచివాలయం, హెల్త్‌సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం-2 వెళ్లే మార్గంలో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తున్నాయి. మురుగుపై నుంచే నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లడానికి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం



చౌడేశ్వరిదేవిని దర్శించుకుంటున్న భక్తులు



జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల ప్రజల ఆరాధ్య దైవం చౌడేశ్వరిదేవి తిరునాల సందర్భంగా సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు జ్యోతి మహోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా సుంకులా పరమేశ్వరి ఆలయం నుంచి మేళతాళాలు, వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య జ్యోతులను గ్రామ వీధుల మీదుగా ఊరేగింపుగా చౌడేశ్వరిదేవి ఆలయానికి తీసుకొచ్చారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శివపార్వతి, కాళికామాత వేషధారణలు ఆకట్టుకున్నాయి. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గౌరి హుస్సేన్‌రెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, రామస్వామి, శేఖర్ రెడ్డి, రఘురామిరెడ్డి, శంకరయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న వేషధారణలు